ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

❖ ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది

దశ, సూర్యాపేట ప్రతినిధి : సూర్యాపేట పట్టణంలోని 10వ వార్డు కుప్పిరెడ్డి గూడెంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మేప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించాలి, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైస్సార్, ఆర్డీఆర్ గార్ల ఆలోచన మేరకు ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి క్వింటాకు 500 బోనస్ అందిస్తున్నట్లు గుర్తు చేశారు. రైతులకు ఉచిత కరెంట్, రుణ మాఫీ, రైతు భరోసా, 500 బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెలిపారు. అందుకోసమే రాష్ట్రంలో సన్నాలు పండించే రైతులను ప్రోత్సహస్తుందని అన్నారు. దీనివల్ల మన రైతుల వద్దనే సన్నాలు కొని మళ్ళీ మనకే సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందువలన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే పంటను అమ్మాలని సూచించారు. తేమ 17 శాతం ఉండాలని, బస్తా 41 కేజీలు మాత్రమే తూకం వేయాలని ఈ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలి, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు వెక్కంటి శేఖర్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమ సతీష్, శ్రీ దండు మైసమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్ గౌడ్, చెంచల నిఖిల్, వెక్కంటి వెంకట్ రెడ్డి, కనుకు వెంకన్న, ఆదిమల్ల కృష్ణ, కనుకు రేణుక, శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మందాడి వెంకట్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోటమర్తిలో శ్మశానవాటిక దారి సర్వే కోసం వినతి

దశ,అడ్డగూడూరు: యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలోని కోటమర్తి గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లే దారిని సర్వే చేయించి, హద్దులు నిర్ణయించాలని కోరుతూ సర్పంచ్ పాశం విష్ణువర్ధన్ రావు సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని శ్మశానవాటికకు వెళ్లే బాట విషయంలో స్పష్టమైన హద్దులు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రముఖులు పాశం యాదగిరి, తోట నాగరాజు, వేముల భిక్షం, తోట నారాయణ, లింగాల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షే మమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

❖ ఎల్ ఓ సి చెక్కును అందజేసిన సర్పంచ్ మల్లేష్

దశ, తుంగతుర్తి: పేదల సంక్షేమ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని సర్పంచ్ కలకోట్ల మల్లేష్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన మిడిదొడ్డి రామచంద్ర చెయ్యి సర్జరీ కోసంఎల్ఓసి కింద రెండు లక్షల 50 వేల రూపాయల చెకును వారి కుటుంబానికి అందజేశారు. నిరుపేదలకు మెరుగైన వైద్య ఖర్చులకోసం సీఎం రేవంత్ రెడ్డి ఎల్ఓసిని చేపట్టారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జట్టంగి లింగయ్య, మారగాని రమేష్, దేశ మ ల్ల బాలరాజు, కలకొట్ల నాగరాజు, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానం-ఒక అశ్వమేధ యాగం

దశ, సూర్యాపేట ప్రతినిధి : స్పందన శరీర, అవయవ దాన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణానికి చెందిన విశ్రాంత జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి డిఎస్వి శర్మ తమ అవయవ దాన అంగీకార పత్రాన్ని సంస్థ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా స్పందన స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షులు గుండా రమేష్ మాట్లాడుతూ డిఎస్వి శర్మ విశాల దృక్పథంతో, మానవీయ కోణంలో పవిత్ర ఆశయంతో శరీర, అవయవ దాతగా ముందుకు రావడం సమాజానికి స్ఫూర్తిదాయకమని, అవయవ దానం ఒక అశ్వమేధ యాగంతో సమానమని ఈ ముందడుగు భావితరాలకు ప్రేరణ ప్రయత్నమని ప్రస్తుతించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జి రమేష్, మిట్ట కోల కోటయ్య, కోశాధికారి హెచ్. పిచ్చిరెడ్డి, సభ్యులు రౌతు రమేష్ అంగీకార పత్రాన్ని స్వీకరిస్తూ, దాత డిఎస్వి శర్మ సహృదయతను, సత్సంకల్పాన్ని అభినందించారు. శర్మ మాట్లాడుతూ ఈ ప్రక్రియ వల్ల మానవుడు మరణించిన ఇతరులలో జీవిస్తూ జన్మ సార్థకతను పొందవచ్చు అని, అంతేగాక వైద్య విద్యార్థులకు శాస్త్రీయ పరిశోధన నిమిత్తం విజ్ఞానదాయకంగా ఉండగలదని అభిప్రాయపడ్డారు.

దేశానికి దశ దిశ చూపించింది బీజేపీ

❖ బీజేపీ ప్రభుత్వంలో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా అభివృద్ధి.

❖ బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ.

దశ, సూర్యాపేట ప్రతినిధి : భారతదేశానికి దశ దిశ చూపించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీజేపీ పార్టీదే అని సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్రావు నివాసం వద్ద బీజేపీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొంబాయినగరంలో ఆవిర్భవించిన బీజేపీ పార్టీ అతి తక్కువ కాలంలో దేశంలో అధికారం సాధించి అనేక అబివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చూట్టిందన్నారు. ఆటల్ బిహారి వాజ్పేయి ప్రధానిగా ఉన్న సమయంతో పాటు నేడు మూడు దఫాలుగా అధికారంలో ఉన్న ప్రధాని మోదీ వరకు అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా అభివృద్ధి జరిగిందన్నారు. దేశంలోని మారు మూల పల్లె వరకు అర్హులైన నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకంతో నేడు లబ్ధి పొందుతున్నారని ఆన్నారు. గత ప్రభుత్వాల కాలంలో పరిష్కారం కాని అనేక సమస్యలను బీజేపీ అధికారంలో నరేంద్రమోదీ పరిష్కరించి దేశ కీర్తిని పెంచారన్నారు. అందుకే ప్రజలు దేశంలోని 350పార్లమెంట్ స్థానాల్లో 2019లో జరిగిన ఎన్నికల్లో భారీ విజయాన్ని అందించి మూడోసారి హ్యాట్రిక్ విజయం అందించారని గుర్తు చేశారు. దేశాభివృద్ధికి పాటు పడుతున్న బీజేపీ పార్టీకి అండగా నిలువాల్సిన బాద్యత ప్రజలందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, మైనార్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. ఆబిద్, జిల్లా నాయకులు సలిగంటి వీరేందర్, బూర మల్సూర్, సంద్యాల సైదులు, రంగినేని లక్ష్మణ్ రావు, గోగుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చౌళ్ళగూడెంలో ముందస్తు బడిబాట కార్యక్రమం

దశ,అడ్డగూడూరు: యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలోని వెల్దేవి,చౌళ్ళగూడెంలో ప్రధానోపాధ్యాయులు పి జానయ్య వెల్దేవి గ్రామ సర్పంచ్ రాచకొండ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ..గ్రామంలోని 1వ తరగతి నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు మన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అన్నారు.ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మన తెలంగాణ ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ పాఠశాలలో అందిస్తుందని అన్నారు.విద్యతోపాటు యూనిఫామ్,తెలుగు ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాలు,షూస్,టై, బెల్ట్,ఉదయం పూట రాగి జావా,సన్న బియ్యం మధ్యాహ్నం భోజనం,అందిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కడెం సోమయ్య,కడెం అమృతమ్మ,కడెం కలమ్మ,కడెం అంబిక,చిలుకూరి వెంకన్న,గజ్జి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల చట్టపర పరిష్కారానికి తక్షణ కృషి

❖ కె నరసింహ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట జిల్లా.

దశ, సూర్యాపేట ప్రతినిధి : పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ జిల్లా పోలీస్ కార్యాలయం నందు పిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన పిర్యాదుదారుల నుండి పిర్యాదులు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు బరోసా కల్పించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలి

❖ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

దశ, సూర్యాపేట ప్రతినిధి : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి గ్రీవేన్స్ లకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు దరఖాస్తు లను పరిష్కరించాలని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కలెక్టరేట్ లోని ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అలాగే ప్రతి కార్యాలయంలోని ఫైల్స్ అన్ని సక్రమంగా ఉంచుకోవాలని ప్రతి కార్యాలయ సిబ్బంది అటెండెన్స్ తప్పనిసరిగా ఫేస్ రికగ్నేషన్ యాప్ లో నమోదు చేయాలని, కలెక్టరేట్ లోని ప్రతి కార్యాలయంలో ఫైల్స్ సరిగా లేకపోయినా, శుభ్రంగా ఉండని కార్యాలయాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఆదేశించారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 28 దరఖాస్తులు, మున్సిపాలిటీ 6, డిఆర్డిఏ 4, డిపిఓ 4, మిగిలిన 20 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 58 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కే సీతారామా రావు, సీఈఓ జడ్పీ శిరీష ఆర్డీవో వేణు మాధవరావు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు హాజరయ్యారు.